# ప్రేమకోసం

—నెల్లుట్ల దేవానంద్ రావు

"ఈ రాత్రి నాకుచాలా అందంగా కనిపిస్తుంది బహుశా ఇదంతా నీ ప్రభావం కాబోలు" అన్నాను జయ కళ్ళలోకి సూటిగా చూస్తూ.

అందంగా, మత్తుగా నవ్వింది జయ మళ్ళీ బుగ్గమీద సొట్టపడింది. నా మంచం పైనుండి లేచి, జయ పక్కమీద కూర్చుని, జయనిదగ్గరగా తీసుకొని జయా ఈ రాత్రి బంగాళాలో నువ్వు, నేను, ఇద్దరమే ఒంటరిగా ఉన్నాము ఒకరి కొకరంతోడు వుండగా ఒంటరితనం ఎలా అవుతుంది అంటావా? మనిద్దరం ప్రియుడు ప్రియురాలం మనిద్దరికీ వేర్వేరు హృదయాలు లేవుగా. మనిద్దరిదీ కలిసి మనకున్నది ఒకటే హృదయం— అది మనిద్దరి సాన్నిధ్యంలో మన హృదయంలో పనిచేగాని, తుచ్ఛమైన ఈశరీరాలతో ఏం పని? అందుకే ఒక హృదయంకల మనిద్దరం వున్న ఈసమయం మనకి ఒంటరితనమే అన్నాను నా మాటలు విని మళ్ళీ అలాగే నవ్వి, మంచంపైనుండి లేచి వెళుతున్న జయ చేతినిపట్టుకొని నా హృదయం మీదకు లాక్కున్నాను.

అలాగే రొమ్ముమీద తలఆన్చి నా హృదయంలోని కలకలాన్ని వింటుందేమో జయా

"నా హృదయం చేసే సవ్వడి నీకు స్పష్టంగా వినిపించుతున్నదేమో. నే చెప్పేదా?" అడిగాను జయను చిలిపిగా.

చురుగ్గా తలెత్తి, చిలిపిగా నవ్వి "చెప్పండి" అన్నట్టు చూచింది జయ

"జయా ఇప్పుడిప్పుడే నా హృదయంలో ఒక సంఘర్షణ జరుగుతుంది నిజంగా నామనస్సులోని భావాలు చెప్తున్నాను. నిన్ను శాశ్వతంగా నాదగ్గరుంచుకోవాలను కుంటున్నాను. నీతో గడపనిరోజులు నాకొద్దు అనిపిస్తుంది కాని నిన్నెలా నాదగ్గర శాశ్వతంగా బంధించగలను? అని నన్ను నేను ప్రశ్నించుకుంటే జవాబు ఏమొచ్చిందో వింటావా? ఈ వెన్నెలరాత్రి నిన్ను ఏదో చేసి నీవాడిగా నన్ను చేసుకోమంది నా మనస్సు" అన్నాను చిన్నగా నవ్వుతూ

ఆశ్చర్యంగా రెప్పలు టపటప లాడించిందిజయ తరువాత చిన్నగా, అదో మాదిరిగా నవ్విందిజయ ఆ నవ్వులో మునపటి అందాలు లేవు

నేను మంచంపైనుండి లేచి, నా మంచంపైనున్న సిగరెట్‌ను వెలిగించుకొని వెన్నెలను చల్లగా, అందంగా విరజల్లుతున్న చంద్రుణ్ణి చూస్తూ నిల్చుండిపోయాను

వెక్కు చుదుక్కు మనేసరికి ఉలిక్కిపడి సిగరెట్‌ను అప్రయత్నంగా, పడేశాను. వెనక్కి తిరిగి చూసాను

ఎదురుగ్గాజయ తెల్లటిచీర, ఆరెంగు జాకెట్ నల్లనికురులు, వాటిని వెక్కిరిస్తున్నట్లు తలనిండా మల్లెలు. ఎప్పుడు కనిపించనంత అందంగా కనిపించింది జయ ఏదో ఉద్రేకంతో గబగబ ముందుకడుగులేస్తున్న నేను హఠాత్తుగా నిల్చుండిపోయాను. నాలోని ఆవేశమంతా నీరుకారిపోయింది. మనిషిని చల్లబడ్డాను. జయ కళ్ళలోనుండి నీరు అవిరామంగా కారుతోంది. దానినాపటానికి ఆమె ఎలాంటి ప్రయత్నం చేయటంలేదు—

వెంటనే తేరుకొని, ముందు కడుగేస్తూ "ఎందుకేడుస్తున్నావు జయా" అంటూ ప్రశ్నించాను ఆశ్చర్యంగా ఆదుర్దాతో.

కన్నీళ్ళు తుడుచుకుంటూ లేచి కూర్చుంది. నేను ప్రక్కనకూర్చుని ఆమెని దగ్గరగా తీసుకున్నాను నా ఒడిలో నున్నా ఇంకా ఏడుస్తూనేవుంది జయ. ఈసారి స్పష్టంగా వినిపించిందికూడాను ఆమె ఏడ్వటంతో నాకు ఏడుపువచ్చింది కాని నా దుఃఖానికి శబ్దంలేదు కన్నీరు జయ తలమీద పడుతున్నాయి జయ నల్లనికురులువాటిని వెక్కిరిస్తున్నమల్లెలు కన్నీళ్ళను చూసి పరామర్శించటం మొదలెట్టాయి. "భార్యభర్తలు పోట్లాడుకుంటుండగా, హఠాత్తుగా చుట్టంవస్తే తమపోట్లాట మరచి ఇద్దరూ కలిసి అతన్నెలా పరామర్శిస్తారో అలా"

ఆమెను ఎలా ఓదార్చాలో నాకు తెలియటంలేదు. ఏనాడు ఇలా ఫీల్ కాలేదు అసలు ఆడది ఏడుస్తుంటే, దాన్నెలా సముదాయించాలో నాకు తెలియదు. కనీసం నా భార్యకూడ నాముందు ఏనాడు ఏడ్వలేదు అది ఎప్పుడు ఏడ్వనందుకు అకారణ తలే కోపమొచ్చింది దానిమీద

నాఒళ్ళోపడుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది ఒక నిశ్చయానికివచ్చాను తనలోని బాధకు ఉపశమనం కల్గేంతవరకు ఏడుస్తుంది. ఆ తర్వాత తనే నవ్వుతుంది. అనుకున్నాను ఆమె వెన్ను నిమురుతూ అలాగే కూర్చుండిపోయాను నేను

కొద్దిసేపటికి జయ ముఖం పైకెత్తి ఆమె కన్నీళ్ళను తుడుస్తూ "చూడు జయా, భయపడకు నిన్నేం చేయను నువ్వేదన్నార్థం చేసుకున్నావేంటేనా? ఏదో ఉద్రేకంలో ఆమాట అనగలిగానే కాని, ఇంకో ప్రదేశానికి కొన్నైనా అడుగు ముందుకేసి భవిష్యత్తునంతా బాధకరం చేసేంత అవివేకిని కాను జయా, నిన్ను బాధపెట్టి నేను మాత్రం సుఖపడగలనా? ఇంతకు ముందేగా అన్నాను మనిద్దరికి వున్నది ఒకే హృదయం" అని అంటూ లాలించాను

ఏదో చెప్పాలనుకుంటుంది జయ కాని ఎందుకో చెప్పలేకపోతున్నది. ఆమె పెదవులు వణికిపోతున్నవి. ఆమె పెదవులపై నా చూపుడు వ్రేలుతో కొద్దిసేపు వ్రాసి "ఇక నిశ్చింతగా పడుకో" అంటూ నా మంచంమీద వ్రాలాను. చల్లగా నా పరుపు నన్ను వెక్కిరించింది. మొదటి సారిగా భార్యలేని లోటు కనిపించింది నాకు

మర్నాడు ప్రొద్దున్న మెలుకువ వచ్చేసరికి, జయ నా ఛాతిమీద తలపెట్టి నిదురపోతుంది. అలాగే కదలకుండా కొద్దిసేపుండిపోయాను. ఆ తరువాత నెమ్మదిగా సిగరెట్ అంటించుకున్నాను సిగరెట్ పీలుస్తూ ఏదో ఆలోచిస్తున్నాను

"ఇలా మమ్మల్నిద్దరిని ఎవరైన చూస్తే?" హఠాత్తుగా అనుమానం వేసింది. కాని దీనిలోని సంతోషం, ఆనందం ఎవరికి తెలుస్తుంది. ఏ నీచపుటాలోచనలేని మేము ఒకరినొకరను నిష్కపటంగా ప్రేమించుకుంటున్నాం. ఆమె కోసం ఎలాంటి త్యాగానికైనా వెనకాడను-

నా హృదయంలో ఆమెకు ఒక పెద్ద స్థానం. ఆస్థానాన్నిగూర్చి నేనే ఊహించలేక పోతున్నాను నా జీవితమే ఆమెకు అర్పించాను. ఆమె దేవత నేను పూజరిని. నాకు ఆమె ఆమెకు నేను మా ఇద్దరి జీవితాలు పెనవేసుకపోయావి- వాటికి విడిపోలేనంతగా అవినాభావ సంబంధం వుంది నా ఆలోచనలన్ని ఆమె చుట్టూ తిరుగుతుంటాయి నే నే పని చేసిన ఆమె చెప్పినట్లు అన్పిస్తుంది ఆమె వూహించిలేనంతగా ఆమెను ప్రేమించాను ఆమె ఎక్కడున్న ఎప్పటికి, ఎల్లప్పుడు నా జీవితాంతం ఆమెను మరిచిపోలేను.

నేను పిచ్చివాణి కాని ఆమెను మరచి పోవటమా? అది సాధ్య మౌతుందా? ఆమెను మరచి పోయానంటే, నన్ను నేను మరచినట్లేగా నా మనస్సంతా ఆమె నిండివుంటే ఆమెను మరచిపోయేది ఏవిధంగా? ఆమెను మరచి నేను నా ప్రాణాలతో బ్రతికి వుంటానా?

ఫ్యాక్టరి కెళ్ళాలంటే ఎన్నడూ లేనిది ఆరోజు బద్ధకం వేసింది కానితప్పదు మనసులోకివస్తున్న ఆలోచనలను బలవంతంగా దూరంగా నెట్టి, ఎలాగో ఫ్యాక్టరీకెళ్ళాను కాని పని ఎలా చేయగలను ఏపని చేద్దామన్నా జయే జ్ఞప్తి కొస్తున్నది. ఇంట్లో ఒంటరిగా జయ ఏం చేస్తుందో? ఎప్పుడు లేనిది ఈరోజు జీవితం అంటేనే విసుగేసింది.

అసలు జీవితం అంటే ఎమిటి? తినటం, తిరగడం, డబ్బు సంపాదించడమే నా! ఇదేనా జీవితం అంటే!

నా మట్టుకు నాకు జీవితం అంటే కోరుకున్న నెచ్చెలితో ఏ దూరతీరాలకో మానవులెరుగని ప్రాంతాలకు, ఎడారిలాంటి స్థలాలకు వెళ్ళిపోయిగా, సుఖంగా ఒకరి కౌగిలిలో మరొకరు బిగిసుకపోయి అలా అలా గంటలకొద్ది, రోజులకొద్ది కాలం గడపాలని నాతపన. ఈ నాతపన తీరుతుందో? లేదో?

ఈ నాతపన నా భార్య కాంతతో తీర్చుకుందామంటే, ఊహూ వీలుకావడంలేదు. ఎంతసేపూ దానికి పెద్ద ఇల్లు నగలు, చీరలు, నూట్లు సంపాదన ఆడంబరం ఇవేగాని......

కట్టుకున్న భర్త ముద్దుముచ్చటా తీర్చాలని తెలీదు ఈ "నాతపనలో" అర్థం లేదంటుంది" కాంత.

ఇదంతా పుస్తకాలభాష మీకు కావాలనుకుంటే చదువుకోండి. కానినన్ను మాత్రం పుస్తకాల్లాగా బ్రతకమనకండి అంటుంది ఇక దానికేం చెప్పాలో నాకుతోచదు. ఇలాగే ఇన్నిరోజులు నిర్లిప్తంగా, నిరాశతో గడచిపోయాయి

హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది జయ మాఇద్దరి మనసులు ఒకటే ఆమెకుకూడ నాకు కలిగినట్లాంటి కోరిక ఉండొచ్చు- నే కోరితే కాదనదు నేను ఇన్నాళ్ళుతీరదని అనుకున్న కోరిక నెరవేరబోతున్నది జయకి చెప్పాలి అనుకుంటూ వెంటనే ఇంటికి బయల్దేరాను.

కాని మరుక్షణమే మరొకటితోచింది జయతో ఏదూరతీరాలకో వెళ్ళి, ఈ మనుషులు కన్పించనంతదూరం వెళ్ళి ఒకరినొకరు చూసుకుంటూ గడపవలసిన అవసరం ఏమిటి? జయనిచూస్తే నే తనకి మిగితా ప్రపంచం కన్పించదే- అలాంటి జయతో ఎక్కడో?

జయ పాపం ఏంచేస్తుందో? నేనింట్లో లేనందుకు ఎంత విసుక్కుంటుదో? నామీద కోపం వచ్చివుంటుంది, అబ్బ జయకి కోపంవచ్చినప్పుడు మరింత అందంగా వుంటుంది ముందే పెద్దకళ్ళు అదుతో కోపంతో మరింత పెద్దవౌతాయి ముక్కుకొన ఎర్రబడి కెంపు మాదిరి మెరుస్తుంటుంది నన్ను చూడ్డంతోటే అప్పటివరకు వున్నకోపం చటున గాలికి ఎగిరిపోతుంది. అపుడు నాను ఆమెను అమాంతం

[సశేషం]